సాక్షి జగిత్యాల

శనివారం । 30 । డిసెంబర్ । 2023



అయోధ్య అక్షింతల ఊరేగింపు

కథలాపూర్: అయోధ్యలో శ్రీరాములవారి పూజలందుకున్న అక్షింతలను శుక్రవారం మండలంలోని సిరికొండలో ఊరేగించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు శుక్రవారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

గరిష్టం/కనిష్టం
30.0/16.0

వాతావరణం

జిల్లాలో నేడు వాతావరణం పొడిగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి తీవ్రమైన పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సుస్థిర జీవన విధానం అలవర్చుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్

జగిత్యాల: విద్యార్థి దశలోనే సుస్థిర జీవన విధానం అలవర్చుకోవాలని నేషనల్ గ్రీన్ కార్ప్స్ రాష్ట్ర ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో ఎకో క్లబ్ వర్క్‌షాప్‌ను మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమెట్ చేంజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు భూమి, నీరు, గాలిని పొల్యూషన్ నుంచి కాపాడి భావితరాలకు కాలుష్య రహిత ప్రపంచాన్ని ఇవ్వడానికి ముందడుగు వేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్ ఆనందరావు, రాజ్‌గోపాల్, శివకిరణ్ పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో విఫలం



మాట్లాడుతున్న అనగంటి వెంకటేశ్

జగిత్యాలటౌన్: ఏటా కోటి ఉద్యోగాలిస్తామంటూ అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం యువతను మోసం చేసిందని, ఏడాదిలోపు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, మరో నాలుగేళ్లలో ఏటా లక్ష ఉద్యోగాలిస్తామని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తనహామీని నిలబెట్టుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా నాయకుడు హరీశ్ అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి సమావేశానికి హాజరయ్యాడు. మోదీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ, ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీని తక్షణమే ప్రక్షాళన చేసి, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందూరి సులోచన, నిమిషకవి రాజేశ్, ఎం.రమ్య, ఎండీ.జాకీర్, సిరికొండ గణేశ్, చిలుక శివ, వసంత, భారతి పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ నిర్లక్ష్యంతో బియ్యం వాపస్

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో టెక్నికల్ అసిస్టెంట్ నిర్లక్ష్యంతో ఇతర జిల్లాలకు పంపించిన సన్నబియ్యాన్ని అక్కడి పౌరసరఫరాలశాఖ అధికారులు నాణ్యత లేవని వాపస్ పంపించారు. జిల్లాలో పౌరసరఫరాల అధికారులు రైస్‌మిల్లర్ల నుంచి సన్న బియ్యం సేకరించారు. గోదాముల్లో నిలువ చేసి ఇటీవలే ప్రభుత్వ వసతి గృహాలకు, పాఠశాలలకు అందజేసేందుకు సిద్దిపేటకు మూడు లారీలు, ఆసిఫాబాద్‌కు రెండు లారీలు పంపించారు. అక్కడి పౌరసరఫరాలశాఖ అధికారులు బియ్యం నాణ్యతగా లేవని లారీలను వాపస్ పంపించారు. ఈ విషయంపై పౌరసరఫరాల శాఖ మేనేజర్ అతిరామ్‌ను వివరణ కోరగా, టెక్నికల్ అసిస్టెంట్ తప్పిదంతో బియ్యం నాణ్యతలేవని, వాపస్ వచ్చింది నిజమే అన్నారు.

వణుకుతున్న పెద్దాస్పత్రి



చిత్రంలో బెడ్‌పై పడుకుని కనిపిస్తున్న వ్యక్తిపేరు శేఖర్. జిల్లాలోని బీర్‌పూర్ మండలం తుంగూర్. కొద్దిరోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. నాలుగైదు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో ఇబ్బంది పడుతున్నాడు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో బెడ్‌షీట్లు, కప్పుకోవడానికి దుప్పట్లు లేకపోవడంతో ఇంటినుంచే తెచ్చుకున్నాడు. వైద్యాధికారులు బెడ్‌షీట్లు, దుప్పట్లు ఇస్తున్నామని చెబుతున్నా ఎక్కడా కనిపించడం లేదు.



ఇది జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి. దీంతో పాటు, ధరూర్ క్యాంప్‌లో మాతాశిశు సంక్షేమ కేంద్రం ఉంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో తీవ్ర చలిగాలి వీస్తోంది. దీంతో చికిత్స పొందుతున్నవారు రోగాలకన్నా చలితోనే అవస్థలు పడుతున్నారు. జనరల్ ఆస్పత్రి పాతది కావడం, కిటికీలు, తలుపులు లేకపోవడంతో చలిగాలి లోనికి వస్తోంది. ఇక్కడి సిబ్బంది దుప్పట్లు, బెడ్‌షీట్లు ఇవ్వకపోవడంతో ఇంటినుంచి తెచ్చుకున్నవే వాడుకోవాల్సిన పరిస్థితి.

- ఆస్పత్రిలో దుప్పట్లు కరువు
- చలి పెరగడంతో రోగుల ఇబ్బందులు
- పట్టించుకోని వైద్యాధికారులు
- జిల్లాలోని మిగతా ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి..

జగిత్యాల: రోగాలబారిన పడి ఆస్పత్రికి వస్తే ఇక్కడి పరిస్థితులతో ఆ రోగం నయంకాకపోగా.. మరింత ఇబ్బంది పడుతున్నామని జగిత్యాల ఆస్పత్రికి వచ్చేవారు చెబుతున్నారు. సాయంత్రమైందంటే చలిగాలులతో రాత్రంతా తల్లడిల్లుతున్నట్లు ఇక్కడ చికిత్స పొందుతున్నవారు వాపోతున్నారు. కిటికీలు, తులుపులు, సదుపాయాలు సరిగాలేవని.. చలికి కనీసం దుప్పట్లు ఇవ్వడం లేదని చెబుతున్నారు. జిల్లాకేంద్రంలోని పెద్దాస్పత్రి ఇటీవలే జనరల్ ఆస్పత్రిగా మారింది. మెడికల్ కళాశాల ఏర్పాటుతో 320 పడకలుగా ఏర్పడింది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 200లకు పైగా పడకలు ఉండగా, మాతా శిశు సంక్షేమ కేంద్రంలో 100 పడకలు ఉన్నాయి. ఈ ఆస్పత్రికి నిత్యం వెయ్యికి పైగానే అవుట్‌పేషెంట్లు, 200లకు పైగా ఇన్‌పేషెంట్లు వస్తుంటారు.

పాత ఆస్పత్రి.. ఇంటి నుంచే దుప్పట్లు

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి పాతది కావడం, సరైన కిటికీలు లేవు. అద్దాలు పగిలిపోయి ఉన్నాయి. అట్టలు, కర్టెన్లు అడ్డుపెట్టుకుంటూ చలిగాలుల నుంచి రక్షణ పొందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో తప్పకుండా బెడ్‌షీట్లు, దుప్పట్లు ఇవ్వాలి. కానీ ఇక్కడికి వచ్చే రోగులు ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. మరికొందరు చలికి వణికిపోతున్నారు. మాతా శిశు సంక్షేమ కేంద్రంలో అయితే గర్భిణులు, బాలింతలు చాలా ఇబ్బంది పడుతున్నారు. దుప్పట్లు, బెడ్‌షీట్లు వచ్చాయని వైద్యాధికారులు పేర్కొంటున్నా ఇప్పటి వరకు రోగులకు అందించలేదు. ఇంటి నుంచే తెచ్చుకుంటున్నట్లు పలువురు చెబుతున్నారు.

ప్రతీ ఆస్పత్రిలోనూ అంతే

జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురిలో కమ్యునిటీ హెల్త్‌సెంటర్లు ఉన్నాయి. ఇవి 100 పడకల ఆస్పత్రులు కావడంతో రోగులు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. ఇక్కడ సైతం బెడ్‌షీట్లు, దుప్పట్లు లేకపోవడంతో పరదాలు అడ్డుగా పెట్టుకుని చలిలో కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోగులకు దుప్పట్లు, బెడ్‌షీట్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రికి వచ్చేవారు కోరుతున్నారు.



ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లతో పేషెంట్



ఆస్పత్రి కిటికీలకు అడ్డుగా కట్టిన దుప్పట్లు

పంపిణీ చేస్తున్నాం

ఇటీవలే బెడ్‌షీట్లు వచ్చాయి. దుప్పట్లు సైతం ఇస్తున్నాం. రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల ఓ డాక్టర్ సైతం సేవభావంతో కొన్ని దుప్పట్లు పంపిణీ చేశారు. మొత్తం మంది రోగులకు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రజాపాలనకు స్పందన

- రెండో రోజు పోటెత్తిన అర్జీలు
- 47,052 దరఖాస్తుల స్వీకరణ

జగిత్యాల: జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్జీదారుల కోసం కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు బారులు తీరుతున్నారు. రెండోరోజు శుక్రవారం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, మండలాలు కలుపుకుని 47,052 దరఖాస్తులు వచ్చాయి. రెండు రోజులకు కలిపి మొత్తంగా 77,301 దరఖాస్తులు స్వీకరించినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

దరఖాస్తుల కోసం ఆందోళనలు

ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తు ఫారాల కోసం అక్కడక్క ఆందోళనలు కొనసాగాయి. అన్నిచోట్ల ప్రభుత్వమే నేరుగా అందజేస్తున్నప్పటికీ, కొన్నిచోట్ల ఫారాలు అందడం లేదని ప్రజలు చెప్పుకొచ్చారు. ఈ విషయమై అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరుగ్యారంటీల పథకానికి ఉచితంగానే దరఖాస్తు ఫారాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. 6వ తేదీ వరకు ప్రతీరోజు దరఖాస్తుల స్వీకరిస్తామని అన్నారు. ఎలాంటి ఆందోళన చెందకూడదని, వివిధశాఖల అధికారులు పర్యవేక్షిస్తుంటారని, ఎలాంటి ఇబ్బందులున్నా దృష్టికి తీసుకురావాలన్నారు. నిరక్షరాస్యుల దరఖాస్తులు నింపేందుకు యంత్రాంగాన్ని సైతం అందుబాటులో ఉంచామని, జనవరి 6 వరకు ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండోరోజు గ్రామపంచాయతీల పరిధిలో 31,996 గృహాలు, మున్సిపల్ వార్డుల్లో 15,056 గృహాలను కవర్ చేయడం జరిగిందని వివరించారు.

రెండో రోజు ఇలా..

రెండోరోజు జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో కోరుట్లలో అత్యధికంగా 5,481 దరఖాస్తులు వచ్చాయి. మెట్‌పల్లిలో 5,131, జగిత్యాలలో 2,636, ధర్మపురిలో 1,395, రాయికల్‌లో 413 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మండలాల వారీగా చూస్తే వెల్గటూరు మండల పరిధిలో అత్యధికంగా 3,213 దరఖాస్తులు స్వీకరించారు. బీర్పూర్‌లో 144, జగిత్యాలలో 502, జగిత్యాల రూరల్‌లో 2,815, సారంగాపూర్ 1,751, రాయికల్ 1,513, ధర్మపురి 2,091, గొల్లపల్లి 2,642, పెగడపల్లి 1,450, బుగ్గారం 420, ఇబ్రహీంపట్నం 1,091, కోరుట్ల 441, మల్లాపూర్ 1,740, మెట్‌పల్లి 2,159, కొడిమ్యాల 2,286, మల్యాల 1,918, మేడిపల్లి 3,111, కథలాపూర్‌లో 2,709 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు.



దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

జిల్లాలో దరఖాస్తుల వివరాలు

మున్సిపాలిటీల్లో వచ్చిన మొత్తం:	24,315
మండలాల్లో వచ్చినవి:	52,986
మొత్తం :	77,301
శుక్రవారం స్వీకరించినవి	
మున్సిపాలిటీల్లో :	15,056
మండలాల్లో :	31,996
మొత్తం :	47,052

రేషన్‌కార్డులకు అవకాశం



ప్రజాపాలనను పరిశీలిస్తున్న డీఈవో

రాయికల్: ప్రజాపాలనలో రేషన్‌కార్డులు లేనివారు, పేర్లు నమోదు చేసుకునే వారు దరఖాస్తులు చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కౌంటర్ వద్ద ఒక తెల్ల కాగితంపై రేషన్‌కార్డులు లేనివారు పేర్లు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ ఖయ్యూం, పంచాయతీ కార్యదర్శి ఏఈ ప్రసాద్, సర్పంచ్ చింతలపల్లి స్వప్న, ఎంపీటీసీ దొంతి నాగరాజు పాల్గొన్నారు.

సీపీడబ్ల్యూ స్కీం పునరుద్ధరించండి


- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వినతి

జగిత్యాలటౌన్: జగిత్యాల నియోజకవర్గంలోని బీర్‌పూర్, రాయికల్ సీపీడబ్ల్యూ స్కీంలు పునరుద్ధరించడంతో పాటు రాయికల్‌లో అగ్నిమాపకకేంద్రం పునరుద్ధరించేందుకు రూ.5కోట్లు మంజూరు చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. తన విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించారని జీవన్‌రెడ్డి తెలిపారు. 2004– 09 మధ్యకాలంలో కాంగ్రెస్ హయాంలో రాయికల్, బీర్‌పూర్ ప్రాంతాల్లోని గ్రామీణ ప్రాంతానికి శుద్ధినీరు అందించేందుకు సీపీడబ్ల్యూ స్కీం ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మిషన్‌భగీరథ ఏర్పాటుతో సీపీడబ్ల్యూ స్కీం మూసివేశారని వివరించారు. ప్రస్తుతం జిల్లాలో ఇటు మిషన్‌భగీరథ నీరు సరఫరా చేయకపోవడం, అటు సీపీడబ్ల్యూస్కీం మూసివేయడంతో గ్రామీణ ప్రజలు తాగునీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దశాబ్దకాలంగా సీపీడబ్ల్యూ స్కీం నిలిచిపోవడంతో యాంత్రసామగ్రి మూలకు పడిందని, స్కీం పునరుద్ధరణకు జగిత్యాల మండలానికి రూ.150లక్షలు, రాయికల్ మండలానికి రూ.150లక్షలు, బీర్పూర్ మండలానికి రూ.190లక్షలు అవసరం అవుతాయని సీఎంకు వివరించినట్లు తెలిపారు. గతంలో రాయికల్‌లో అగ్నిమాపకకేంద్రం ఏర్పాటు చేయడంతో రాయికల్, బీర్‌పూర్, సారంగాపూర్, మల్లాపూర్ మండలాల్లో ప్రమాదాల నివారణకు అనువుగా ఉండేదని, రాయికల్‌లో అగ్నిమాపకకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీఎంను కోరినట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.



సీఎంతో జీవన్‌రెడ్డి

'ఆరు గ్యారంటీలకు కొంత సమయమిస్తాం'



సారంగాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేసేందుకు కొంత సమయం ఇస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బీర్‌పూర్‌లో 14మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కమ్మునూర్, రేకులపల్లి ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీహామీ నెరవేర్చాలన్నారు. అందుకోసం కొంత సమయం ఇస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, కొల్ముల రమణ, సర్పంచ్‌లు గర్ష కుర్తి శిల్ప, నల్ల మహిపాల్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్‌స్థాయి సంఘం సమావేశాలు జరిగాయి. ఈ సమావేశంలో విద్యా, వైద్యం, మహిళా శిశుసంక్షేమశాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేపట్టిన మనఊరు– మనబడి కార్యక్రమంలో మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కరోనా మళ్లీ వ్యాపిస్తున్న నేపథ్యంలో శానిటైజేషన్ చేయాలని ఆదేశించారు. సంక్షేమ వసతిగృహాల్లో వేడినీటి వసతి కల్పించాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీల వివరాలు సమర్పించాలని, లబ్ధిదారులకు పోషకాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జగిత్యాల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో పునుగోటి ప్రశాంతి, జిల్లా సంక్షేమాధికారి ఆడెపు భాస్కర్, కార్యనిర్వహణాధికారి రఘువరణ్, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఈ ఏడాది పలు సంచలన సంఘటనలకు వేదికైంది. హత్య, ఆత్మహత్య, మిస్సింగ్, చోరీలు, కాల్పులు, టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ, అవినీతి, అరెస్టు, టీచర్ల బయోమెట్రిక్ డుమ్మా, తిరుపతికి ప్రయాణికుల ఇక్కట్లు.. ఇలా ఏ రకమైన వార్త తీసుకున్నా అది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వీటన్నింటిపై 'సాక్షి' దినపత్రిక స్పాట్ వార్తలతో పాటు ప్రత్యేక కథనాలు ప్రచురించింది. స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం వెంటవెంటనే చర్యలు తీసుకుంది. పలుశాఖల అధికారుల అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించారు. బాధ్యులను విధుల నుంచి తప్పించారు. –సాక్షిప్రతినిధి, కరీంనగర్



అన్నీ సంచలనాలే...

2023 రివైండ్

- చోరీలు.. హత్య.. ఆత్మహత్యలు.. అవినీతి, అక్రమాలు
- 'టీఎస్‌పీఎస్సీ' కేసుతో కరీంనగర్‌కు లింకు
- పదోతరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో ఎంపీ సంజయ్ అరెస్టు
- రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఉమ్మడి జిల్లా ఘటనలు



జనవరి 1–2023: ఆత్మహత్యలు కావు హత్యలే.. గతేడాది కొత్త సంవత్సరం రోజున గంగాధరలో ఒకే కుటుంబంలో ఇద్దరు పిల్లలు, తల్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ మరణాల గుట్టు నూతన సంవత్సరం రోజునే వీడింది. తండ్రే తన పిల్లలకు, భార్యకు ఎస్ఏఓహెచ్ అనే రసాయనం కలిపి ఇచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తొలుత ఈ విషయాన్ని 'సాక్షి' వెల్లడించింది. ఆ తర్వాత నిందితుడు కూడా ఆత్మహత్య చేసుకోవడంతో కేసు మూసివేశారు.

ఫిబ్రవరి 24: కొండగట్టు ఆలయంలో బీదర్ దొంగల చోరీ.. ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆలయంలో బీదర్ నుంచి వచ్చిన దొంగలు చోరీ చేశారు. పలు వెండి ఆభరణాలు, తాపడాలను ఎత్తుకెళ్లారు. పోలీసులు 24 గంటల్లోనే కేసును ఛేదించడం గమనార్హం. ఈ విషయాన్ని కూడా 'సాక్షి' ముందుగానే ఎక్స్‌క్లూజివ్‌గా పాఠకులకు అందించింది.

మార్చి 16: టీచకుడు.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తోటి మహిళా టీచర్లను వేధిస్తున్న వైనాన్ని 'సాక్షి' బయటపెట్టింది. పకడ్బందీగా ఆయన వికృత చేష్టలను లోకానికి చూపించడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, సస్పెన్షన్ వేటు వేశారు.

10లో▸

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి


వినోద్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వలస కూలీ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం బైపాస్ రోడ్డు పనులు చేపడుతున్న డీబీఎల్ కంపెనీలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అంగికలన్ మీర్జాపూర్‌కు చెందిన వినోద్(23) కూలీగా పనిచేస్తున్నాడు. ఓం ప్రకాశ్ అనే మరోవ్యక్తితో ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం ఖాజీపేటకు వెళ్లారు. తిరిగి తుమ్మనపల్లికి గురువారం అర్ధరాత్రి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. వినోద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఓంప్రకాశ్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి కుటుంబసభ్యుడు ఆమల్ ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

లైంగిక దాడి కేసులో ఒకరికి జైలు

వేములవాడ: మానసిక వికలాంగురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డ బుక్క రాంచంద్రం(55)కు రెండేళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ వేములవాడ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ప్రవీణ్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు. రుద్రంగికి చెందిన ఓ దంపతులకు నలుగురు సంతానం. వీరిలో ముగ్గురికి పెళ్లిళ్లు కాగా.. చిన్నకూతురు మానసిక వికలాంగురాలు. ఆరోగ్యం సరిగ్గా లేని యువతి(27)కి పెళ్లి కాకపోవడంతో ఇంటి వద్దనే ఉంటుంది. 2018 ఫిబ్రవరి 2న తల్లిదండ్రులు బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లగా ఒంటరిగా ఉన్న యువతిపై అదే ప్రాంతానికి చెందిన బుక్క రాంచంద్రం అలియాస్ రాములు(55) లైంగికదాడికి పాల్పడ్డాడు. యువతి అరుపులు, కేకలు వేయడంతో రాంచంద్రం పరారయ్యాడు. ఈ సంఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదుతో రుద్రంగి ఎస్సై విద్యాసాగర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో సాక్షులను వేములవాడ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్ కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడు రాంచంద్రంకు జైలు, జరిమానా విధించినట్లు ఏపీపీ విక్రాంత్ వివరించారు.

వృద్ధుడి ఆత్మహత్య

సిరిసిల్లక్రైం: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన వాసం సత్యనారాయణ పదేళ్లుగా మూర్ఛ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. అనేక విధాలుగా చికిత్స తీసుకున్న వ్యాధి నయం కాలేదు. మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లోని రేకులషెడ్ పైకప్పుకు ఉరివేసుకున్నాడు. మృతుని కుమారుడు వాసం శ్రీకాంత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలు..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన పానగంటి నర్సమ్మ(80) శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. బీర్‌పూర్ ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం నర్సమ్మ కోడలు పది నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. కుమారుడి పిల్లలు చిన్నవాళ్లు కావడంతో వారిని పోషించడం, కొడుకు పడుతున్న వేదన ఆమెను కలిచివేసింది. దీనికితోడు నర్సమ్మ పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటుండడంతో మనస్తాపం చెందింది. బహిర్భూమికి అని వెళ్లి సమీపంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కొడుకు నర్సయ్య ఫిర్యాదుతో మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అన్నీ సంచలనాలే...

సాక్షిప్రతినిధి, కరీంనగర్


'కట్టా'ను పట్టుకున్నాం!


దళితబంధులో అవినీతి జాడలు!

మార్చి 18: టీఎస్‌పీఎస్సీ కలకలం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాలలీకేజీలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజశేఖర్‌రెడ్డిది జగిత్యాల జిల్లానే. దీంతో సిట్ బృందం పలు మార్లు జిల్లాకు వచ్చి విచారణ చేపట్టింది. కరీంనగర్ జిల్లాలోని బొమ్మకల్‌లోనూ లీకేజీకి లింకుందని గుర్తించారు. ఆ తర్వాత ఓ ప్రముఖ కాలేజీలో పనిచేసే సిబ్బందిని కూడా అరెస్టు చేశారు.

ఫిబ్రవరి 03–2023: తల్లీపిల్లలను కలిపిన సాక్షి.. కరీంనగర్ మంకమ్మతోట నుంచి ఓ మహిళ ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసి, మహారాష్ట్ర తీసుకెళ్లింది. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో పోలీసులు ఆ పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించి, నిందితురాలిపై కేసు నమోదు చేశారు.

మార్చి 15: 'కట్టా'ను పట్టుకున్న సాక్షి.. నకిలీ అర్హతలతో 34 ఏళ్లుగా పంచాయతీరాజ్ శాఖలో కొలువు చేస్తున్న కట్టా విష్ణువర్ధన్ అనే ఉద్యోగి నిర్వాకంపై 'సాక్షి' వరుస పరిశోధన కథనాలు వెలువరించింది. వీటికి ఉన్నతాధికారులు స్పందించి, ఆయన అక్రమాలు నిజమేనని తేల్చారు. అనంతరం సస్పెన్షన్ వేటు వేశారు.

ఏప్రిల్ 1: పోలీసులకు శాశ్వత ఫోన్ నంబర్.. పోలీసులందరికీ ఒకే శాశ్వత నంబర్‌ను కేటాయిస్తూ పోలీసు శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ విధానాన్ని కరీంనగర్ నుంచే అమలుకు నిర్ణయించింది. డిపార్ట్‌మెంట్‌లో చేరిన వ్యక్తి రిటైరయ్యే వరకు ఒకే నంబర్ ఉంటుంది. దాన్నే పీఎఫ్, బ్యాంకు ఖాతాలకు అనుసంధానిస్తారు.

ఏప్రిల్ 4: బండి సంజయ్ అరెస్టు.. పదోతరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో ఎంపీ బండి సంజయ్‌ను కరీంనగర్ పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేసి, హనుమకొండకు తరలించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో ఎంపీ సెల్‌ఫోన్ పోయింది. ఇంతవరకూ దొరకలేదు.

ఏప్రిల్ 20: మానకొండూర్‌లో కాల్పుల కలకలం.. మానకొండూర్ మండల కేంద్రంలో కాల్పులు జరిగాయన్న వార్త కలకలం రేపింది. అరుణ్ అనే యువకుడిపై గోదావరిఖనికి చెందిన సాయితేజ్, అతని మిత్రులు కలిసి హత్యాయత్నం చేశారు. నాటు తుపాకీతో కాల్చగా అది పేలలేదు. పోలీసులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

మే 24: నా కోడిని చంపేశారు.. తన టర్కీ కోడిని పొరుగింటి వ్యక్తి చంపాడంటూ ఓ వ్యక్తి కరీంనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, ఈ వార్త 'సాక్షి'లో ప్రముఖంగా ప్రచురించడం చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారింది.

జూన్ 27: ఉగ్రకేసులో తండ్రీకూతుళ్ల అరెస్టు.. ఉగ్రవాదులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో రామగుండంలో తలదాచుకున్న ఓ తండ్రీకూతుళ్లను ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీనగర్‌కి చెందిన ఇస్లామిక్ స్టేట్ సానుభూతిపరులతో చాటింగ్ చేసినట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. తండ్రి గతంలో హైదరాబాద్‌లో జరిగిన ఓ పేలుళ్ల కేసులో నిందితుడిగా ఉన్నాడని సమాచారం.

ఆగస్టు 14: బాలిక మృతి కేసులో కొత్త ట్విస్ట్.. పెద్దపల్లి శివారులో నివసించే మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ బాలిక గాయపడి, అనుమానాస్పద స్థితిలో మరణించడం కలకలం రేపింది. ఆమెపై సామూహిక లైంగిక దాడి జరిగిందన్న ఆరోపణలు వచ్చినా.. దర్యాప్తులో ఆత్మహత్య చేసుకుందని తెలియడంతో కేసు మిస్టరీ వీడింది.

జనవరి 05: సరసమైన ధరలకే విరాసత్.. గంగాధర మండల తహసీల్దార్ కార్యాలయంలో వారసత్వ భూములు విరాసత్ చేసే విషయంలో ఫోన్‌పే ద్వారా రూ.లక్షల లంచాలు తీసుకున్నారు. అయినా పని చేయకపోవడంతో బాధితులు 'సాక్షి'ని ఆశ్రయించారు. ఈ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురావడంతో విచారణ జరిపిన కలెక్టర్ కార్యాలయం తహసీల్దార్‌ను బదిలీ చేసి, వీఆర్ఏ, వీఆర్వోలను సస్పెండ్ చేసింది.

జనవరి 21: పల్లెల్లో సహారా కలకలం.. అధిక వడ్డీ రేట్ల ఆశచూపి, డిపాజిట్లు సేకరించిన సహారా సంస్థ కస్టమర్లకు డబ్బులు తిరిగి చెల్లించడం లేదు. ఈ విషయం గోప్యంగా ఉంచి వారిని మభ్యపెడుతూ వస్తున్నారు. ఈ కుంభకోణం 'సాక్షి' పరిశోధనాత్మక కథనంతో వెలుగుచూసింది. రంగంలోకి దిగిన పోలీసులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు రాష్ట్రంలో పలుచోట్ల కేసులు నమోదు చేసి, కీలక దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు.

జూలై 03: దళితబంధులో మామూళ్ల పర్వం.. దళితబంధు పథకంలో మామూళ్ల పర్వంపై 'సాక్షి'లో ప్రచురితమైంది. దీనిపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. మరో ఉద్యోగి సస్పెన్షన్ భయంతో లీవు మీద వెళ్లారు.

జూలై 04: డుమ్మా మాస్టార్లు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీచర్లు బయోమెట్రిక్ ఉన్నా డుమ్మా కొడుతున్న వైనాన్ని 'సాక్షి' డుమ్మా మాస్టార్లు పేరిట కథనం ప్రచురించింది. దీనికి కరీంనగర్ డీఈవో స్పందించి, ఆలస్యమైతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

సెప్టెంబర్ 08: రైతుబీమా ఐడీలలో జాప్యం.. రైతుబీమా, ఎల్ఐసీ ప్రీమియం పొందాలంటే ఐడీలు తప్పనిసరి. కానీ, ఈ–జెనరేట్ కాక పలువురు మరణించిన రైతుల కుటుంబాలకు బీమా జాప్యమైంది. విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో స్పందించిన వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించారు.

సెప్టెంబరు 20: స్పౌజ్ కోటా దుర్వినియోగం.. దంపతులిద్దరూ ప్రభుత్వ టీచర్లయితే ఒకేచోట పని చేసేందుకు ఉద్దేశించిన స్పౌజ్ కోటాను పలువురు టీచర్లు కేవలం హెచ్‌ఆర్ఏ కోసం దుర్వినియోగం చేశారు. ఈ విషయాన్ని 'సాక్షి' ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన విద్యాశాఖ వారిపై చర్యలు చేపట్టింది.

సెప్టెంబర్ 29: తప్పుడు ర్యాంకులతో పదోన్నతులు.. పదోన్నతులు, బదిలీల్లో టీచర్ల ర్యాంకులను తప్పుగా చూపించారు. 317 జీవో సమయంలో ఒకలా, ఇప్పుడు మరోలా చూపించిన వైనాన్ని 'సాక్షి' బట్టబయలు చేసింది. దీంతో స్పందించిన విద్యాశాఖ తప్పుడు ర్యాంకులతో పదోన్నతులు, బదిలీ చేయించుకున్న వారిపై చర్యలు చేపట్టింది.

అక్టోబర్ 31: కలెక్టర్ నివాసంలో చోరీ.. అక్టోబర్ 30న రాత్రి కరీంనగర్ కలెక్టర్ బి.గోపి నివాసంలో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఉప్పులూరుకు చెందిన పగిడిపల్లి ప్రసాద్ చోరబడ్డాడు. కలెక్టర్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, చార్జర్, బ్యాగు, పెన్‌డ్రైవ్‌ను ఎత్తుకెళ్లాడు. పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. నవంబర్ 7న అతన్ని అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు.

జూలై19: పోలింగ్ కేంద్రాల సమస్యలపై జూలైలో 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. స్పందించిన ఉన్నతాధికారులు తప్పులను సరిదిద్దారు. డిసెంబర్‌లో కొత్తపోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

డిసెంబర్ 22: తిరుపతికి ఇక వారానికి నాలుగు రైళ్లు.. కరీంనగర్ నుంచి తిరుపతికి వారానికి రెండు సార్లు ఉన్న బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఇకపై నాలుగుసార్లు నడపాలని కేంద్రం నిర్ణయించింది. ప్రయాణికుల ఇక్కట్లపై 'సాక్షి' వరుస కథనాలకు స్పందించిన ఎంపీ బండి సంజయ్ సర్వీసుల సంఖ్య పెంచుతానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు.

డిసెంబర్ 27: ఎల్‌పీసీ సమర్పించాలి.. లాస్ట్ పేమెంట్ సర్టిఫికెట్ (ఎల్‌పీసీ) సమర్పించకుండానే పలువురు ఇంజినీర్లు కరీంనగర్‌లో ఉద్యోగం చేస్తున్న వైనంపై 'సాక్షి' ప్రచురించిన కథనానికి నగరపాలక కమిషనర్ స్పందించారు. అధికారులందరూ వెంటనే ఎల్‌పీసీ సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

క్వింటాల్ పత్తి రూ.6,750


వేలం పాడుతున్న వ్యాపారులు

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి గరిష్ట ధర రూ.6,750 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 82 వాహనాల్లో 766 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,600, కనిష్ట ధర రూ.6,000కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు.

సీసీఐ కొనుగోళ్లు..

76 మంది రైతుల వద్ద నుంచి 1,053.60 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,970, మోడల్ ధర రూ.6,900, కనిష్ట ధర రూ.6,690 పలికింది. కాగా, మార్కెట్ యార్డుకు శని, ఆదివారాలు సాధారణ, సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా మొత్తం మూడు రోజులపాటు సెలువులు ఉంటాయని కార్యదర్శి రెడ్డినాయక్ తెలిపారు. మంగళవారం క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపిక


షీల్డుతో చైత్ర

సైదాపూర్: మండలంలోని దుద్దెనపల్లికి చెందిన తాళ్లపల్లి చైత్ర గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపికైనట్లు ఆమె తండ్రి అజయ్ శుక్రవారం తెలిపారు. చైత్ర జమ్మికుంట కాకతీయ పాఠశాలలో 5వ తరగతి చదువుతోందన్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌లోని భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో ప్రతిభ కనపరిచిందని పేర్కొన్నారు. ఆమెను పాఠశాల యాజమాన్యం, టీచర్లు అభినందించారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం కలిగోట గ్రామానికి చెందిన బొడ్డు హరీశ్‌ను హత్యాయత్నం కేసులో శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. హరీశ్‌కు తన తల్లి రాజవ్వ, సోదరి జవ్వాజి అనూషతో గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన హరీశ్ వారిపై కత్తితో దాడి చేశాడు. బొడ్డు రాజవ్వ ఫిర్యాదు మేరకు హరీశ్‌పై కేసు నమోదు చేసి శుక్రవారం రాత్రి అరెస్టు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి


శివరామరాజును సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ సాగర్‌రావు

- యూఎస్ఏ ప్రొఫెసర్ శివరామరాజు
- 'జ్యోతిష్మతి'లో స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్‌పై సెమినార్

తిమ్మాపూర్: విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి నైపుణ్యం పెంచుకోవాలని యూఎస్ఏ ప్రొఫెసర్, జ్యోతిష్మతి అకాడమిక్ బోర్డు అడ్వైజర్ శివరామరాజు అన్నారు. తిమ్మాపూర్ మండలం కేంద్రంలోని జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్‌పై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. అమెరికాకు చెందిన మెకానికల్ ఇంజినీరింగ్ డైరెక్టర్ ఆఫ్ బల్క్ సాలిడ్స్ సెంటర్ కనాస్ స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శివరామరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ కోర్సులతో ఆచరణాత్మకమైన జ్ఞానం పెంపొందించుకోవడానికి వీలుంటుందని తెలిపారు. విద్యార్థులు అధ్యాపకులు చెప్పిన అంశాలపై దృష్టిసారించి, తమవంతుగా విశేష కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న, మధ్య తరహా ఇండస్ట్రీల్లో తమ నైపుణ్యం ప్రదర్శిస్తూ మాతృదేశానికి సేవ చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం ఆయనను కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.కార్యక్రమంలో సెక్రెటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ కేఎస్.రావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో 'అచీవర్స్' ప్రతిభ


బహుమతి తీసుకుంటున్న పాఠశాల డైరెక్టర్

కరీంనగర్: స్థానిక కోతిరాంపూర్‌లోని అచీవర్స్ పాఠశాల 2023–24 ఏడాదికి నేషనల్ లెవల్ మిడిల్ ఆఫ్ ది ఇయర్ ఐఐటీ జేఈఈ ఫౌండేషన్ పరీక్షలో అవార్డు సాధించింది. పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రథమస్థానంలో నిలవగా.. కె.అవినాష్, ఎం.నిశిత, జే.వికాస్, కే.శ్రీ సహస్రరెడ్డి బంగారు పతకాలు సాధించారు. ఈ మేరకు పాఠశాల డైరెక్టర్‌కు లీడ్ ప్రతినిధి వినోద్‌పవార్ జ్ఞాపిక అందించారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి అభినందించారు.

5వతరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనకబడిన తరగతుల సంక్షేమ విద్యాశాఖల ఆధ్వర్యంలో ఇంగ్లిష్ మీడియంలో బోధనతో విజయవంతంగా నడుస్తున్న గురుకుల పాఠశాలల్లో 2024–2025 విద్యా సంవత్సరానికి 5వతరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి 6 జనవరి 2024 లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు https://tgcet.cgg.gov.in, https://www.tswreis.ac.inను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప స్వాములకు గాయాలు

వేములవాడ: వేములవాడకు చెందిన అయ్యప్ప మాలధారులు కారులో శబరిమల వెళ్తుండగా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం సమీపంలో ప్రమాదానికి గురైనట్లు బంధువుల ద్వారా తెలిసింది. అనంతపురం సమీపంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఉదయం పొగమంచు కురుస్తుండడంతో రోడ్డుపై ఉన్న జేసీబీ కనిపించక ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పాశం భాస్కర్‌రెడ్డి, బాలు తీవ్రంగా, చిక్కుడు మల్లేశం, పిట్టల తిరుపతి స్వల్పంగా గాయపడ్డట్లు బంధువుల ద్వారా తెలిసింది. క్షతగాత్రులను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

స్కిల్ టైటాన్ గ్రాండ్ ఫినాలెలో మూడో స్థానం



నగదు పురస్కారంతో శుభశ్రీ సాహు

కొత్తపల్లి(కరీంనగర్): పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న శుభశ్రీ సాహు శాస్త్రీయ ఆవిష్కరణలో భాగంగా ఓఎల్ఎల్ సీఎన్ఎన్ టీవీ 18 స్కిల్ టైటాన్స్–23 ఇటీవల ముంబైలో నిర్వహించిన స్కిల్ టైటాన్ గ్రాండ్ ఫినాలెలో మూడో స్థానంలో నిలిచి రూ.2లక్షల నగదు బహుమతి గెలుచుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం రితేష్ మెహతా తెలిపారు. ప్రధాని ఆర్థిక శాస్త్ర సలహా మండలి కన్సల్టెంట్ అపూర్వశర్మ చేతుల మీదుగా నగదు బహుమతి గెలుచుకోవడం గర్వంగా ఉందని చెప్పారు. శుభశ్రీ తన గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు నేతృత్వంలో పర్యావరణ అనుకూలమైన, మల్టిఫంక్షనల్, తక్కువ ధర, పోర్టబుల్ వ్యవసాయ యంత్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేసిందని తెలిపారు. ఈ యంత్రం నూర్పిడి, ధాన్యాన్ని వేరు చేయడం, గడ్డిని కత్తిరించడం, వినోవింగ్, బ్యాగ్ కుట్టడం వంటి నాలుగు వేర్వేరు కార్యకలాపాలతో పని చేస్తుందన్నారు. సౌర శక్తితో పని చేసే ఈ యంత్రానికి విద్యుత్ వినియోగం తగ్గనుందని చెప్పారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్, వి.యు.ఎం.ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ విద్యార్థిని అభినందించారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు

- అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

కరీంనగర్‌క్రైం: ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకునే చర్యలపై శుక్రవారం కమిషనరేట్‌లోని జాన్‌విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో 500 మంది ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్‌లైసెన్స్, ఆటోకు ధ్రువీకరణపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఆటో నడిపే సమయంలో యూనిఫామ్ ధరించాలని సూచించారు. ప్రయాణికులు తమ విలువైన వస్తువులను మరిచిపోతే సమీప పోలీస్‌స్టేషన్లలో అప్పగించి నిజాయితీ చాటుకోవాలన్నారు. ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, సర్వర్, సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐలు రమేశ్, ఖరీముల్లాఖాన్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం కథ సుఖాంతం

- సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్‌లో ఆచూకీ లభ్యం
- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు
- స్కూల్‌కు పంపిస్తారని ఇంటికి వెళ్లలేదన్న ఏసీపీ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఏసీపీ కమలాకర్‌రావు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ విద్యారణ్యపురికి చెందిన బాలిక అదృశ్యం కథ ఆమె ఆచూకీ లభించడంతో సుఖాంతమైంది. కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాలిక బుధవారం మధ్యాహ్నం బస్సులో పెద్దపల్లి నుంచి వచ్చి, కరీంనగర్ బొమ్మకల్ చౌరస్తా వద్ద దిగి, అదృశ్యమైంది. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీపీ అభిషేక్ మహంతి ఆదేశాల మేరకు 5 బృందాలు ఏర్పాటు చేసి, గాలింపు చర్యలు ప్రారంభించారు. బాలిక కరీంనగర్‌లో బస్సు దిగిన తర్వాత బస్టాండ్‌కు ఆటోలో చేరుకుంది. అక్కడి నుంచి వివిధ బస్సుల్లో హైదరాబాద్, జగిత్యాలకు ప్రయాణం చేసింది. జగిత్యాల వెళ్లే క్రమంలో ఓ యువకుడు సోషల్ మీడియాలో చూసి, బాలిక జగిత్యాల వెళ్తోందని పోలీసులకు సమాచారమిచ్చాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి వెళ్లి, వెతికారు. ఆయా బస్టాండ్ల పరిసరాల్లోని సీసీ పుటేజీలు పరిశీలించగా ఆమె కనిపించలేదు. జగిత్యాల నుంచి వరంగల్, నిజామాబాద్, అక్కడి నుంచి గురువారం అర్ధరాత్రి హైదరాబాద్ చేరుకుంది. సికింద్రాబాద్ జేబీఎస్‌లో వెతుకుతున్న కరీంనగర్ పోలీసులకు ఓ ఆటోడ్రైవర్ పాపను చూసి, విషయం చెప్పగా వెళ్లి, పట్టుకున్నారు. అనంతరం ఆమెను కరీంనగర్ తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. పిల్లలతో తల్లిదండ్రులు ప్రేమగా, స్నేహపూర్వకంగా మెదలాలని ఏసీపీ కరుణాకర్‌రావు సూచించారు. ఇంటికి వెళ్తే అమ్మానాన్న స్కూల్‌కు పంపిస్తారని బాలిక ఇంటికి వెళ్లలేదని తెలిపారు. పాప అదృశ్యమైన 36 గంటల్లోనే పట్టుకున్న పోలీసులను సీపీ, ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్ఐ వెంకట్రాజం పాల్గొన్నారు.

ఏఈవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాము



కరీంనగర్ అర్బన్: వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చెప్యాల రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోగా.. జిల్లా నుంచి రాము ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర మాజీ అధ్యక్షులు అశోక్, రామకృష్ణారెడ్డి, జగదీశ్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. రాము ఎన్నిక పట్ల జిల్లా ఏఈవోలు హర్షం వ్యక్తం చేశారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలి


వెంకటరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న అభ్యర్థులు

కరీంనగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2008లో నిర్వహించిన డీఎస్సీలో క్వాలిఫై అయినవారికి సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కోరారు. 2008 డీఎస్సీ అభ్యర్థులు శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో చాడ వెంకటరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 2008లో డీఎస్సీ నిర్వహించిందని, క్వాలిఫై అయిన వారికి అనివార్య కారణాల వల్ల ఉద్యోగాలు ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో సీఎం కేసీఆర్‌కకు సమస్యను విన్నవించగా తప్పకుండా ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని అప్పటి విద్యాశాఖమంత్రి కడియం శ్రీహరి పెండింగ్‌లో పెట్టారని అన్నారు. పక్క రాష్ట్రం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చి అండగా నిలిచారని అన్నారు. మన రాష్ట్రంలో హైకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ అభ్యర్థులకు తీరని అన్యాయం జరగడం బాధాకరమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మానవత్వంతో ఆలోచించి 2008 డీఎస్సీ క్వాలిఫై అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో భూక్య తిరుపతి నాయక్, సమిత, జలపతిరెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురికి జీవితఖైదు

- రూ.2 వేల జరిమానా విధించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

జగిత్యాలక్రైం: జిల్లాలోని రాయికల్ మండలం కుర్మపల్లి గ్రామానికి చెందిన పుల్ల గంగమల్లయ్యను భూవివాదంలో హత్య చేసిన అదే గ్రామానికి చెందిన పుల్ల లస్మయ్య, పుల్ల మహేశ్, పుల్ల గంగవ్వకు జీవితఖైదుతో పాటు, ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. కుర్మపల్లికి చెందిన పుల్ల గంగమల్లయ్య, లస్మయ్యల మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ వివాదం కోర్టు పరిధిలో ఉండగా, 2019 జనవరి 19న పుల్ల గంగమల్లయ్య భూమిని జేసీబీతో పుల్ల లస్మయ్య, పుల్ల మహేశ్, పుల్ల గంగవ్వలు చదును చేస్తుండగా పుల్ల గంగమల్లయ్య, అతని తండ్రి పుల్ల పోశాలు అక్కడికి వెళ్లారు. అక్కడే ఉన్న ముగ్గురు వీరిద్దరిపై దాడులు చేయడంతో బలమైన గాయాలయ్యాయి. గంగమల్లయ్యను, పోశాలును ఆస్పత్రికి తరలిస్తుండగా గంగమల్లయ్య మార్గమధ్యలో మృతిచెందాడు. ఆయన భార్య పుల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అప్పటి సీఐ రాజేశ్, కానిస్టేబుల్ కిరణ్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్‌లు సాక్ష్యులను ప్రవేశపెట్టగా, నిందితులకు జీవితకాలం జైలుశిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

హత్య కేసులో మరొకరికి..

సారంగాపూర్‌కు చెందిన చెట్‌పల్లి లక్ష్మీరాజంను హత్య చేసిన అదే గ్రామానికి చెందిన సూర నీలయ్యకు జీవితఖైదు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. సారంగాపూర్‌కు చెందిన చెట్‌పల్లి లక్ష్మీరాజం, సూర నీలయ్యల మధ్య వ్యవసాయ భూమికి వెళ్లే రహదారి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. లక్ష్మీరాజం తండ్రి చెట్‌పల్లి గంగయ్య అదే గ్రామానికి చెందిన అల్లెపు నర్సయ్యలు ఇద్దరు కలిసి వివాహ పత్రికలు పంపిణీ చేసేందుకు వెళ్తుండగా సూర నీలయ్య వాహనం తీసుకెళ్లారు. ఈ వాహనం రోడ్డు ప్రమాదానికి గురికావడంతో లక్ష్మీరాజం తండ్రి గంగయ్యకు గాయాలయ్యాయి. ఈ విషయంలో కూడా సూర నీలయ్య, లక్ష్మీరాజం మధ్య గొడవలు జరిగాయి. ఇది మనసులో పెట్టుకుని 2021 జనవరి 24న మధ్యాహ్నం సమయంలో తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్తుండగా నీలయ్య గొడ్డలితో దాడి చేసి లక్ష్మీరాజంను హత్యచేశాడు. మృతుడి కొడుకు చెట్‌పల్లి తిరుపతి ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ సీఐ కృష్ణకుమార్ కేసు నమోదు చేసి సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా నిందితుడికి జీవిత ఖైదు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.